'స్వాతి' మాసపత్రిక - జనవరి 2003

# కౌమార జ్వాల

నాకు మొదటిస్వప్నానుభూతి కలగక ముందే మా సహాధ్యాయిని నీలాంబరి పెద్దమనిషైంది. ఆ రోజు స్కూలు కెళ్లేముందు చద్దన్నాలుతినే సమయంలో, నీలాంబరి తల్లి, వాళ్ళ పనిమనిషి ద్వారా కబురంపడంతో, మా నాయనమ్మ తప్ప మిగిలిన ఆడవాళ్ళందరూ ఎక్కడిపన్లక్కడే వదిలేసి, గబగబా స్నానాలు చేసి వాళ్ళింటికి హడావుడిగా పరుగెత్తారు.

ఆ హడావుడిలో పురిటికని వచ్చిన మాపెద్దక్క అలమారా తాళాలు తనతోపాటు తీసుకపోవడం వల్ల, వాటికోసమని పక్క వీధిలోనే ఉన్న నీలాంబరి వాళ్ళ ఇంటికి పరుగెత్తాను. లేకపోతే మాసిన బట్టలతో స్కూలుకి వెళ్తే మా ప్రధానోపాధ్యాయుడు పేకబెత్తం చూపించి బెదిరిస్తాడు.

నేను వెళ్ళేసరికి వాళ్ల మండువా లోగిలి సందడిగా ఉంది. ఓ పక్క వరండాలో ఓ బస్తాడు ధాన్యం గుమ్మరించి, చదును చేసి, పైన తాటాకుల చాప పరిచి, దానిమీద నీలాంబరిని కూర్చోపెట్టారు.

ఆడవాళ్లందరూ నీలాంబరి నెత్తి మీద కాస్త నువ్వుల నూనె రుద్ది, అక్షింతలు వేసి దీవిస్తున్నారు. నుదుటిన పెట్టిన నిలువు కుంకుం బొట్టు పాపిట్నుంచి కారుతున్న నూనెలో కలిసి ముక్కు మీదకు ప్రాకింది. ఓ కర్ర రోట్లో నువ్వులూ, బెల్లం వేసి అమ్మలక్కలు కొంతమంది చిమ్మిలి దంచుతున్నారు.

కాసేపటికి పెద్దక్క, నాకేసి చూడ్డం, నేను తాళాల కోసం సంజ్ఞ చెయ్యడం జరిగింది. పెద్దక్క నా దగ్గిరకొచ్చి తాళాలు చేతిలో ఉంచి తరిమివేసింది. వెడ్తూ వెడ్తూ నీలాంబరి మొహంలోకి చూశాను. ఆమె నా కళ్ళలోకి చూసి సిగ్గుతో తల వంచుకుంది.

ఆ రోజే కాదు, మూడు రోజులు దాటే వరకు నీలాంబరి స్కూలుకి రాలేదు. కొంతమంది కుర్రాళ్ళు నల్లపిల్ల నీలాంబరి క్లాసుకు రావటల్లేదు, జ్వరమొచ్చిందేమోనని గట్టిగా అనకపోలేదు. ఆ మాటలు విన్న ఆడపిల్లల్లో పమిటలు వేసుకొన్న ఒకరిద్దరు కిసుక్కున నవ్వకపోనూలేదు.

నీలాంబరి క్లాసులో లేని వెలితి మా కుర్రాళ్ళకి కొట్టొచ్చినట్టుండదానికి కొన్ని కారణాలు లేకపోలేవు. ఒకటి - నీలాంబరి నల్లగా ఉంటుంది, రెండు నల్లగా ఉన్నా చాలా అందంగా ఉంటుంది, మూడు - తెల్లగా ఉన్న అమ్మాయిల కంటే తెలివితేటలున్నది.

నాలుగో రోజున నీలాంబరి స్కూలుకి వచ్చింది. మొదటిసారిగా పరికిణీ, జాకెట్టు మీద ఓణి ధరించి వచ్చింది. "నీలాంబరి డ్రెస్సు మార్చిందిరోయ్" అన్నాడో అకతాయి కుర్రాడు. అప్పుడే క్లాసులో అడుగుపెడ్తున్న మా తెలుగు మాస్టారు ఆ మాటలు విని నీలాంబరి కేసి చూసి, కుర్చీలో కూర్చుని చిన్నగా నవ్వుతూ అటెండెన్సు రిజిష్టరు తెరిచారు.

ఆ వయసులో, 'ఆడపిల్లలు పెద్దమనుషులవడం' అన్న విషయం చాలా మార్లువిన్నా అసలు అంతరార్థమేమిటో తెలిసింది కాదు. గౌన్లూ, పరికిణీ, జాకెట్లూ తొడుక్కొనే ఆడపిల్లలు ఓణి లేదా చీర ధరించదానికి, పెద్దమనిషిని చెయ్యడం అనే తంతుగానే ఆ రోజు నేను నీలాంబరింట్లో

చూసిన దృశ్యం వేడుక రూపంలోనే నా మనసులో నాటుకు పోయిందే తప్ప, అసలు విషయం మరింత వయసొచ్చాక కాని నా అవగాహనకి అందలేదు.

నిక్కరు తొడుక్కునే కుర్రాడు ప్యాంటూ, లుంగీ కట్టినప్పుడు అటువంటి వేడుకలెందుకు చెయ్యరన్న అనుమానం వచ్చేది. ఓసారి ఈ మాటే కాస్త చనువున్న మా ఊరి మునిసిపల్ లైబ్రరీని, స్కూలయింతర్వాత పార్ట్‌టైమ్‌గా కూర్చుని నడిపించే 'జాన్' మాష్టార్ని అడిగితే రెండు మొట్టి, 'భడవకానా! ఇప్పట్నుంచే ఈ ఊసులన్నీ నీ కెందుకురా?!' అని మందలించారు.

ఓసారి ఆయన లేనప్పుడు అభిసారిక పత్రిక తియ్యడం చూసి కొట్టినంతపని చేశారు.

మాధ్యమిక పాఠశాలలో ఎనిమిదో తరగతి అయిపోయిన తర్వాత, పాసయిన వాళ్లలో ఇంకా చదువు కొనసాగించాలనుకొనే వాళ్ళందరం, మా ఊరి ఉన్నత పాఠశాలలో చేరాం. మా క్లాసు అమ్మాయిల్లోంచి హైస్కూల్లో జేరింది ఇద్దరే అమ్మాయిలు. ఒకరు నీలాంబరి, మరొకరు ఇందిర.

ఇతర స్కూళ్ళ నుంచి వచ్చి జేరిన వాళ్ళలో ఇంకా అమ్మాయిలున్నారనుకోండి. మొత్తం మీద తొమ్మిదో క్లాసులో ఓ పదిమంది దాకా అమ్మాయిలున్నా వాళ్ళందరిలోనూ నల్ల గులాబీ నీలాంబరి అంటేనే నాకు చెప్పరాని అభిమానంగా ఉండేది.

మా పక్క వీధిలోంచి మకాం ఎత్తేసి దగ్గరగా ఉంటుందని హైస్కూలు సమీపంలో ఓ ఇల్లు తీసుకొని నీలాంబరి నాన్నగారు నాకూ, స్త్రీమాక్షరం పాటించకుండా ఉన్న అందరు ఆడపిల్లల్నీ 'ఎ' సెక్షన్లో పడేసి హెడ్మాస్టరుగారు మా 'సి' సెక్షన్‌కీ తీరని అన్యాయం చేశారు. అస్సలు ఆడపిల్లలు లేని క్లాసు బోసిపోయినట్టుంటుందని వేరే చెప్పాలా?

చూస్తూండగానే మూడేళ్ళు ఇట్టే గడిచిపోయాయి. హైస్కూల్లో ఆఖరి సంవత్సరం చివరి రోజులు వచ్చేసరికి నీలాంబరి సుందర విగ్రహం కుర్ర వాళ్లకీ, కుర్రమాష్టర్లకీ కనువిందుగా ఉండేది.

అప్పటికే వచ్చిరాని గడ్డంతో, మునిముని మీసాలతో, మారుతున్న జీరగొంతుకతో యువప్రాంగణంలో అడుగుపెట్టే చాలామందిలాగే నా అవస్థ ఉండేది. చిన్నప్పుడు నేనూ అందంగా ఉండేవాణ్ణి అన్న భావనతో ఉన్నా ఆ అవస్థలో నన్ను నేను అద్దంలో చూసుకొన్నప్పుడు, ఈ కౌమార రూపం ఎప్పుడు పరిపక్వమౌతుందనే ఆలోచన కలిగేది. మా వయసులోనే ఉన్న నీలాంబరి అంతటి అందాల్ని ఎలా సంతరించుకొందో అర్థమయ్యేది కాదు.

అందమూ, తెలివితేటలు ఒకేచోట ఉండవన్న నమ్మకానికి భిన్నంగా, నీలాంబరి వాళ్ళ సెక్షన్లో అన్ని సబ్జెక్ట్‌లలోనూ ఫస్ట్ మార్కులు తెచ్చుకొనేది. గొప్పలు చెప్పుకోవడం కాదు గాని నా మార్కులు మొత్తం అన్ని సెక్షన్ల మీదా ఫస్ట్‌గా వచ్చేవి.

నేను పుస్తకాలు చదవడంలో అభిరుచి చూపించినా, క్లాసు పుస్తకాల పురుగును మటుకు కాదు. స్కూలయిపోయిన తర్వాత ఓ గంటసేపు మా స్కూల్ గ్రౌండ్‌లో ఏవో ఆటలాడి కాని ఇంటికి వెళ్ళేవాణ్ణికాదు. అప్పుడప్పుడూ కావాలని నీలాంబరి ఇంటి వీధిలోకి మలుపు తిరిగి వేళ్ళేవాణ్ణి.

అప్పటికి నీలాంబరి వాళ్ళ యింటి ఓ అరుగు మీద కూర్చుని పాఠాలు వల్లెవేయడం, లేదా వాళ్ళ నాన్నగారు మరో ఇద్దరు అమ్మాయిలకి నీలాంబరితో సహా పాఠాలు చెప్పడం గమనించేవాణ్ణి. వాళ్ల నాన్నగారికి తెలియకుండా అప్పుడప్పుడూ ఓర చూపు చూసి, చిన్నగా మందహాసం చేసేది.

స్కూల్‌ఫైనల్ బోర్డు పరీక్షలముందు ఇది వరకట్లో 'హోప్ ఎగ్జామ్స్' అని, విద్యార్థుల సత్తా పరీక్షించడానికి డిశంబరు నెలలో పరీక్షలు పెట్టేవారు. సాధారణంగా ఆ పరీక్ష పేపర్లు చాలా కఠినంగా ఇచ్చేవారు. ఆ పరీక్షల్లో మొత్తం మూడు సెక్షన్లలోనూ ఏభై మార్కులు హెచ్చుగా మొదటి స్థానం సంపాదించి సంచలనమే సృష్టించాను.

ఓ రోజు సాయంత్రం స్కూలు ముగిసిన తరువాత నేను ప్లేగ్రౌండ్‌లోకి వెళ్ళబోతుండగా నీలాంబరి నన్నాపి, "హాయిగా ఆడుతూ పాడుతూ అన్ని మార్కులెలా తెచ్చుకొంటావో అర్థంకావటల్లేదు. సరే, నీ లెక్కల నోట్సు ఓసారివ్వు" అంది.

ఆ రోజు నాకు లెక్కల పీరియడ్ లేకపోవడం మూలాన, ఆ మర్నాడు తీసుకువస్తానని చెప్పాను. ఆ మర్నాడు మార్నింగ్ సెషన్‌లో మా లెక్కల పీరియడ్ అయిపోయింతర్వాత, మధ్యాహ్నం లంచ్ బ్రేక్‌లో నీలాంబరికి నా లెక్కల నోట్సు ఇచ్చాను. నేను పుస్తకం ఇవ్వడం చూసిన మా సెక్షన్లోని 'సోంగుండు'గాడు ఎందుకో నవ్వాడు.

ఆ తర్వాతి రోజు సోంగుండుగాడు ఎందుకో నన్ను వెంటాడుతూనే ఉన్నాడు. నీలాంబరి నా నోట్‌బుక్ తిరిగి ఇచ్చిన వెంటనే దాన్ని సోంగుండు నా చేతిలోంచి లాక్కుని పరుగు తీశాడు.

అర్థంకాక నీలాంబరి కేసి చూశాను. ఆమె కళ్లలో కోపం కనిపించింది. "నీకు తెలిసో, లేక తెలియకుండానో సోంగుండు నాకు ప్రేమలేఖ రాసి నీ నోట్‌బుక్‌లో పెట్టాడు" – పై వాళ్ళకెవరికీ వినబడకుండా పళ్ళ మధ్యన మాటలు బిగించి అంది.

"నిజంగా నాకేమీ తెలియదు. నువ్వు నన్ను నా లెక్కల నోట్సు అడగడం విని, నాకు తెలియకుండా ఉత్తరం ఉంచాడనుకుంటాను. నీ సమాధానం ఉంటుందేమోనని వెంటనే లాక్కుని పారిపోయుంటాడు. ఏం సమాధానవిచ్చావు?" కాస్త కుతూహలంగానూ, కొంటెగానూ ప్రశ్నించాను.

"అదే ఉత్తరం మీద గాడిద బొమ్మా, చెప్పు బొమ్మా గీసి ఉంచాను" అంది నవ్వుతూ.

ఇదంతా కాస్త దూరంలో స్టాఫ్‌రూం గుమ్మంలో నిల్చుని చూసుంటాడు కాబోలు 'ఎ' సెక్షన్ కుర్ర లెక్కల టీచర్ కృష్ణస్వామి మా దగ్గరకొచ్చి, "ఏమిటీ గొడవ?" అని కాస్త అథారిటీతో ప్రశ్నించాడు. గొడవ నిజంగా జరగడం నాకూ ఇష్టం లేదు.

"సోంగుండు నా లెక్కల నోట్సు అడిగాడు. ఈమె కూడా అడిగింది. ముందుగా అడిగిన వాడి కివ్వకుండా ఈమె కిచ్చినందుకు కాస్త తిక్కరేగి, నోట్సు నా చేతికి తిరిగి రాగానే ఎక్కడివ్వనేమో నని బలవంతంగా లాక్కుని పోయాడు. పర్వాలేదు లేండి రేపిచ్చేస్తాడు" అన్నాను సీరియస్‌గా.

అయనగారు నా మాటలు నమ్మినట్టు కనబడలేదు. ఆ నోట్‌బుక్ పట్టుకురమ్మన్నాడు. నేను

నా క్లాస్‌రూంలోకి వెళ్ళి నా వెనక డెస్క్ మీద కూర్చునే సోంగుండుని చూశాను. నా డెస్క్ మీద నా పుస్తకాల పక్కనే ఉన్న నోటుబుక్‌ని తీసుకొని వెళ్ళి, కృష్ణస్వామి టీచర్ కిచ్చాను. ఆయన పేజీలన్నీ తిప్పి ఓ ఆరేడు నిముషాలు చూసి, "ఊ! లెక్కలు బాగా చేస్తావన్న మాట" అన్నాడు.

"మొన్న జరిగిన పరీక్షల్లో ఇతనికి లెక్కల్లో నూటికి ఎనభై వచ్చాయి. నాకు అరవై అయిదే వచ్చాయి. అందుకని ఇతని నోట్సు ఓసారి.." నీలాంబరి అర్థాంతరంగా ఆపేసింది.

"సర్లే నీకు తెలియని లెక్కలుంటే నన్నడుగు" అని నీలాంబరితో అని, నోట్‌బుక్ నా చేతిలో ఉంచి వెళ్లిపోయాడు. ఆయన చూపుల్లో ఉడుకుమోత్తనం కనిపించింది. నీలాంబరి కళ్లలో ఒక చిన్న మెరుపు. 'అమ్మాయిలకేసి గుడ్లప్పగించి చూడ్డమే తప్ప లెక్కలు సరిగ్గా చెప్పడు మహానుభావుడు' అని గొణుక్కుంటూ వెళ్లిపోయింది. క్లాసులో అమ్మాయిలుండడం వల్ల ఇదో రకమైన అనర్థమేమరి!

ఇంత గొడవకీ కారణమైనటువంటి నా నోట్సుని పేజీలు తిప్పి చూశాను. మొదటి పేజీలో నా పేరుపైన ఏదో ఎనిమిది సంఖ్యల కూడిక పెన్సిల్‌తో చేసి ఉంది. నా పేరు కింద మరో సంఖ్య. ఏదో రఫ్‌వర్క్ చేసింది కాబోలునని అనుకున్నాను.

ఆ తర్వాత ప్రిపరేషన్ హాలిడేస్ - బోర్డు పరీక్షలు - పరీక్ష ఫలితాలు, అన్నీ క్లాక్‌వర్క్‌లా జరిగిపోయాయి. నోటీస్ బోర్డు మీద మార్కుల లిస్టు పెట్టినప్పుడు హడావుడి అంతా ఇంతా కాదు. స్కూలు ఫస్ట్ వచ్చినందుకు మా 'సి' సెక్షన్ క్లాస్‌టీచర్ నన్నెంతగానో అభినందించాడు. నీలాంబరికి స్కూల్ ఆరో స్థానం లభించింది. నీలాంబరి కోసం చూశాను. కనబడలేదు. అందరూ వెళ్ళేవరకూ ఆగాను.

ఆ తర్వాత నీలాంబరి అడుగులో అడుగు వేసుకొంటూ వచ్చింది. లిస్ట్ చూసి 'కంగ్రాట్స్' అంది. "నాకిన్ని తక్కువ మార్కులెందు కొచ్చాయని అడగొద్దు! పరీక్షకి ముందు నా పెళ్ళికి తాంబూలాలు పుచ్చేసుకొన్నారు. ఎల్లుండి ఉదయమే నా పెళ్ళి. ఇంక పై చదువులు చదవడానికి వీల్లేనప్పుడు ఎన్ని మార్కులొస్తే ఏమిటన్న ఇదితో చదువు నిర్లక్ష్యం చేశాను. నీకా ఇబ్బంది లేదు. ఐ విష్ యూ ఆల్ ద బెస్ట్!" - నీలాంబరి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

ఆడపిల్లలు తమ వివాహాలకి మగ క్లాస్‌మేట్లని ఆహ్వానించడమనేది ఆ కాలంలో ఊహించరాని విషయమే కాదు, కాస్త సాధ్యంకానిది కూడాను. మా కుటుంబానికి వచ్చిన పిలుపు నాధారంగా చేసుకొని, వెళ్ళి పెళ్ళి చూడాలని ఎంతగా మనసు పీకుతున్నా, మా పక్క పల్లెటూరు నుంచి వచ్చిన ఓ అరడజను మంది స్నేహితులతో కాలేజీ ఎడ్మిషన్ల విషయమై చర్చిస్తూ ఇంట్లోనే ఉండి పోయాను.

మా ఇంట్లో ఉన్న ఆడవాళ్లందరూ మార్వాడీ కొట్లో తాకట్టు పెట్టిన బంగారు నగల్ని బ్రతిమాలి తెచ్చుకొని, ఆ పెళ్ళికి పొలోమంటూ వెళ్ళిన సంగతి నా జ్ఞాపకాల్లో చాలాకాలం ఉండిపోయింది.

ఆ తర్వాత పై ఊరు వెళ్లి కాలేజీ జీవితంలో అడుగు పెట్టాను. అధిక కుటుంబ సభ్యులతో ఆచారాల పేరిటా, అనవాయితీల పేరిటా అదుపులేని ఖర్చులతో ఆస్తులు హరించుకుపోయిన కుటుంబం కావడం మూలాన, బ్రతికిచెడ్డ భావం వెంటాడుతుండగా, కుటుంబ గౌరవాన్ని

దృష్టిలో ఉంచుకొని, ఓరకమైన స్వయంనిర్దేశితమైన క్రమశిక్షణతో - బాధ్యతతో పోస్టుగ్రాడ్యుయేషన్ వరకూ సంవత్సరాలు దొర్లించి, అటుపైన అనతికాలంలోనే ఓ కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం సంపాదించాను.

అయితే ఉరకలువేసే యవ్వనమనే అవస్థని గడపడం అంత సులువు కాదు. ఆ ఆలోచనలూ, కోరికలూ ఒక్కోప్పుడు మన నిద్రలో మేల్కొంటాయి. నీలాంబరి ఓ రెండు మూడు సార్లు మాత్రమే నన్ను స్వప్నాలలో అలరించి, తన బిగికౌగిలిలో బంధించి స్పర్శానుభూతినీ, దివ్యానుభూతినీ అందివ్వడం, మెలకువ వచ్చి ఇదంతా అవాస్తవికమైన కలేనా అని నిరాశపడడం జరగకపోలేదు.

'రాత్రి కలలో నీలాంబరి కనిపిస్తే బావుంటుంది' అని అనుకొన్నప్పుడు, పరీక్ష హాలుకి సమయానికి చేరుకోలేకపోవడం, స్టేషన్‌కి వెళ్లేసరికే ట్రైన్ వెళ్ళిపోవడం లాంటి కలలు వచ్చేవి!

సంఘం ఆమోదించే వివాహ బంధపు పరిధిలో భార్యాభర్తలు యవ్వనోద్రేకపు పొంగులు క్రమేపి చల్లారి, వాస్తవంలోకి కలల్లోంచి దిగి ఎలా జీవించవలసి వస్తుందో, అనురాధతో నా వైవాహిక జీవితం సంవత్సరాలుగా అలానే దొర్లిపోయింది.

ఆమె ప్రణయకలహాలతో గారాబాలు పోయినప్పుడు నేను తప్పులు ఒప్పుకొని దాసోహం అనగానే ఆమె వదనంలోని సంతోషాన్నీ, నేను టూర్ల మీద వెళ్ళినప్పుడూ లేదా తను పుట్టింటికి వెళ్ళినప్పుడూ ఆపాటి విరహాన్ననుభవించి తిరిగి కలుసుకొన్నప్పుడు ఆమె కళ్ళలోని మెరుపుల్నీ- సంసారపు తొలి సంవత్సరాల్లో చూసిన నేను ఓ రకమైన యాంత్రికతకు అలవాటుపడి పోయినా, జీవితం నిస్సారం అనిపించనూలేదు. నిత్యనూతన సంతోషతరంగాల మీద పయనించే నావలా సాగిపోనూలేదు.

ఇద్దరు పిల్లలకి తండ్రిగా ఇంట్లోనూ, గంపెడాఫీసర్లమీద అధికారిగా ఆఫీసులోనూ కాలం చాలా శీఘ్రంగానే గడిచిపోయింది. నెత్తిమీద ఉన్న జుట్టు ఊడకపోయినా, నెరిసిన జుట్టుతో ఏభైఎనిమిదవ ఏట పదవీవిరమణ చేశాను.

బ్యాంక్ వాళ్ల సీనియర్ సిటిజన్‌షిప్ వయోపరిమితి అరవై దాటినా, రైల్వే వాళ్ల సీనియర్ సిటిజన్‌షిప్ వయోపరిమితి అరవై అయిదు చేరుకోవడానికి ఇంకో అర్నెల్లు ఆగాల్సిన ఈ సమయంలో, మా అమ్మాయి ఆడపడుచు పెళ్లికని అనురాధతో సహా భీమునిపట్నం వెళ్ళాల్సి వచ్చింది.

విద్య పూర్తయి విశాఖపట్నం వదలి వెళ్ళిన తర్వాత, విమానాల్లో సముద్రాలు దాటిన ప్రయాణాలనెన్నిటినో చేసినా, సముద్రతీరాన కూర్చుని విరిగే అలల్ని చూస్తూ, వీచే గాలిని అనుభవించే అవకాశం రాలేదు. ఎప్పుడో తెల్లవారుఝామున ముహూర్తం. రాత్రి భోజనాలయ్యాక తీరుబడిగా నడుచుకొంటూ వెళ్లి సముద్రపుటొడ్డున ఇసుకలో కూర్చున్నాం.

నూటిరవై ఏళ్ళ తర్వాత అత్యధికమైన కాంతితో సుధాంశుడు సంప్రకాశిస్తున్న పున్నమి రాత్రి. సాంద్రమైన శీతలామృతకిరణాలు నింగినీ, నేలనీ ముంచెత్తుతూ ప్రకృతిని సింగారించి, జీవరాశుల్ని అహ్లాదపరుస్తూ పరవశింపజేస్తున్నాయి.

ఒడ్డుకు తరలివచ్చే వెండి నురుగుల్ని దోసిట పట్టడానికి ఏడేళ్ళ మనవడు చీటికిమాటికి నీళ్ళ అంచులకు పరుగెడ్తోంటే, మా అమ్మాయి వాణ్ణి మందలిస్తోంది. "అమ్మా, వాడు వినడు! తర్టీన్ డాట్ వన్ డాట్ ఫోర్ ఫెలో వాడు!" అంది మా మనవరాలు. వాడి కంటే మూడేళ్లు పెద్ద.

"సుభాషిణీ, ఏమిటా భాష? చాలా తమాషాగా వుందే, నాకేం అర్థంకావడంలేదు" అన్నాను.

"ఆ మాత్రం తెలియదా తాతయ్యా?! ఇంగ్లీషులో పదమూడో అక్షరం 'M', ఒకటోది 'A' నాలుగోది 'D' అంటే MAD ఫెలో అన్నమాట!" అని, తనూ కెరటాల అంచుకు పరిగెత్తింది.

దేదీప్యమానంగా వెలిగిపోతున్న నభోమండల దీపం నుంచి ఓ కృష్ణ నీలాంజనం సముద్ర తరంగాల్ని తాకింది. ఆ నల్లటి మెరుపు నా మస్తిష్కపు సముద్రంలో జ్ఞాపకాల సుడిగుండాన్ని సృష్టించింది. అంకెల తరంగాలు. అక్షరాల... రూపాలు...నా లెక్కల నోట్సులోని మొదటి పేజీలోని సంఖ్యల మెరుపులు, అక్షరాల సమన్వయాలు.. 9,I - 12,L - 15,O - 22,V, 5,E - 25,-Y -15,O - 21,U నా పేరు కింద 14 అంటే N – అంటే I LOVE YOU. నా పేరు కింద తన సంతకంగా N అంటే నీలాంబరి.

ఓ మైగాడ్! స్విచ్ వేసిన నలభై ఏడు సంవత్సరాలకి కాని ఈ ట్యూబ్‌లైట్ వెలగలేదు. ఆ రోజే కనీసం ఆమె వివాహానికి ముందే ఈ సందేశాన్ని డీకోడ్ చెయ్యకలిగి ఉంటే! ఉంటే? ఏం చేయ్యగలిగేవాణ్ణి? ఎదిరించి పెళ్ళి ఆపుచేసేశక్తిలేని చిన్నవయసు. ఇద్దరమూ ఓ తరం ముందుగా పుట్టి ఉంటే, ఓ అయిదెకరాలు నా మెట్రిక్‌కి అదనపు అర్హతగా అందనిచ్చి నన్ను వరుడిగా నిలబెట్టగలిదేమో? నీలాంబరి నాతోపాటే పై చదువులు చదివి ఉంటే, మా జంట కుదరడానికి ఎంత అవకాశముండేదని!

ఇప్పుడు నీలాంబరి ఎక్కడుందో? మాతగా, పితామహిగా, మాతామహిగా ఎంతటి సంసారానికి ఆద్యురాలయిందో? నీలాంబరి నా జ్ఞాపకాల్ని పూర్తిగా చెరిపేసుకుని ఉండి ఉంటుందా? అరాతీసి నీలాంబరి ఎక్కడుందో తెలుసుకొంటే? కలుసుకొని తెలుసుకొనేందుకు ధైర్యమే కాదు, నైతికబలం కూడా ఉండాలిగా?

ఆమె జ్ఞాపకాల్లో ఉండిపోయే ఉంటాననే నమ్మకంతో, ఆమెని కలుసుకొనే ప్రయత్నాలు చేయకుండా ఉండడమే ఉత్తమం. నా ప్రయత్నం లేకుండానే యాదృచ్ఛికంగా కలిస్తే? నీలాంబరి తన సంఖ్యాప్రహేళికకి నా నుండి సమాధానం అడిగితే ఏం చెప్పగలను? అంతా గతజలసేతుబంధనం.

అయితే, ఇప్పుడా శైశవ జ్వాల నా హృదయఫలకం మీద వాతలతో రాతలు రాసింది. అవి ఎవరికీ తెలియని, తెలియకూడని హృదయాక్షరాలు.

"ఏమిటండీ మరీ అంత దీర్ఘాలోచనలోకి మునిగిపోయారు?" – అనూరాధ ప్రశ్నించింది.

వెన్నెల వెలుగులో స్పష్టంగా కనబడ్తూన్న ఆమె ఆకర్షణీయమైన ముఖంలోకి చూశాను. అనురాధ ఎవరికి, ఎంతమందికి హృదయాల్లో శైశవ కీల? మరి అనురాధ ఎదలో కూడా..? తప్పదు! స్త్రీ పురుషుల జ్ఞాపకాల మాటున ఈ బాల్యజ్వాలలు, శైశవ కీలలు, కౌమార జ్వాలలు, పురాతన అగ్నిశిఖలు అజ్ఞాతంగా ప్రజ్వలిస్తూనే ఉంటాయి.